



RK అగ్ని న్యూస్
The Power Of Truth
9441533080 - 8309890844
అక్టోబర్ : 30 బుధవారం సంపుటి : 28 సంచిక : 258

## తల్లిని... చెల్లిని మోసం చేసిన జగన్ కు

# జనాలను మోసం చేయడం ఒక లెక్కా?

### - జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



(అగ్ని ప్రతినిధి,మార్కాపురం) కన్న తల్లిని,తోడ పుట్టిన చెల్లినే మోసం చేసిన జగన్ కు ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేయడం ఒక లెక్కా అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు,మాజీ ముఖ్యమంత్రి జగన్ పై విమర్శలు గుప్పించారు. మంగళవారం మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయస్వామి తదితరులతో కలిసి వెలుగొండ ప్రాజెక్టు సందర్శించిన సందర్భంగా మంత్రి నిమ్మల, మాజీ సీఎం జగన్ పై విరుచుకుపడ్డారు.ఇంట్లోవారిని మోసం చేయడం తెలిసిన జగన్‌కు జనాలను మోసం చేయడం తెలియదా అని ప్రశ్నించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్,ఉత్తుత్తి ప్రారంభోత్సవాల తో పబ్బం గడిపారు అని విమర్శించారు. 2014-19 లో గత టిడిపి పాలనలో వెలిగొండ ప్రాజెక్టుకు 1373 కోట్లు కేటాయించి 1319 కోట్లు, 96 శాతం ఖర్చు చేశాం అని గత అయిదేళ్ళ జగన్ పాలనలో 3518 కోట్ల బడ్జెట్ కేటాయించి, కేవలం 170 కోట్లు (0.04 శాతం) మాత్రమే ఖర్చు పెట్టారు అని అన్నారు.జగన్ పాలన వెలిగొండ ప్రాజెక్టుకు శాపంగా మారింది అని దుయ్యబట్టారు.టన్నెల్స్, ఫీడర్ కెనాల్, రిజర్వాయర్ పనులు, నిర్వాసితులకు 880 కోట్ల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా , ఒక రూపాయ కూడా ఇవ్వకుండానే, ఎన్నికల ముందు వెలిగొండ జాతికి అంకితం అనడం,జగన్ మార్క్ మోసం,దగా కాదా ? అని ప్రశ్నించారు. రెండో టన్నెల్ లో తవ్విన రెండు లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని మొదటి టన్నెల్ చివర భాగాన పోశారు.ఈ మట్టిని తొలగించకుండా నీరు వదలడం సాధ్యం అవుతుందా?అని ఎద్దేవా చేశారు.రెండో టన్నెల్ 12వ కిలోమీటర్ దగ్గర మూడేళ్ళ క్రితమే టన్నెల్ బోరింగ్ మెషిన్ పాడైపోయి ఉంటే దానిని ఎందుకు బయటకు తీయలేక పోయారు?టిబిఎం మెషిన్ బయటకు తీయకుండా నీళ్ళు ఇవ్వడం సాధ్యమేనా? 2లో

## గొట్టిపాటి లక్ష్మి స్కూటీ పై జిల్లా కలెక్టర్ తమీమ్



అగ్ని న్యూస్, మార్కాపురం (అక్టోబర్ 29): వెలుగొండ ప్రాజెక్టు వద్ద ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించేందుకు వచ్చిన ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, దర్శి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మీ స్కూటీ పై ప్రయాణించారు. డాక్టర్ లక్ష్మీ స్కూటీ నడుపుతుండగా కలెక్టర్ వెనుక కూర్చొని ప్రయాణించి వెలుగొండ ప్రాజెక్టు వద్ద నిర్మాణ పనులు పరిశీలించారు. జిల్లా కలెక్టర్, దర్శి ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మీ ఇరువురీ స్కూటీ ప్రయాణం వెలుగొండ ప్రాజెక్టు వద్ద ఆసక్తికర సన్నివేశంగా మారింది.

## వెలిగొండ ప్రాజెక్టు సొరంగాలు పరిశీలించిన మంత్రులు



2లో

అగ్ని న్యూస్, పెద్ద దోర్నాల ( అక్టోబర్ 29) : దోర్నాల మండలం కొత్తూరు సమీపంలో గల పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు సొరంగాలను రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం పరిశీలించారు. ప్రాజెక్టు పురోగతిపై అధికారులను అడిగి తెలుసు కున్నారు. అనంతరం ప్రాజెక్టు గ్యాప్ లను పరిశీలించారు. ఈయన వెంట రాష్ట్ర సాంఘిక సంక్షేమ

### తల్లిని... చెల్లిని మోసం చేసిన జగన్ కు

# జనాలను మోసం చేయడం ఒక లెక్కా?

**మొదటి పేజి తరువాయి**

అని అన్నారు.రెండు టన్నెల్స్ నుండి 11,500 క్యూసెక్కుల నీరు తరలించాల్సి ఉండగా, కనీసం 10 క్యూసెక్కుల నీరు కూడా తీసుకెళ్ళలేని పరిస్థితి ఉంది. 53 టిఎంసిల సామర్థ్యం ఉన్న నల్లమలసాగర్ లో కనీసం అర టిఎంసి నీరు కూడా నిల్వ చేయలేని పరిస్దితి ఉంది అని ఆవేదన వ్యక్తం చేశారు.ఏ ప్రాజెక్టుకు వెళ్ళినా జగన్ మోహాన్ రెడ్డి విధ్వంసమే కనిపిస్తోంది. ఎందుకంటే కడప జిల్లాకు చెందిన తమ అనుచరుడికి వెలిగొండ హెడ్ రెగ్యులేటర్ పనులు అప్పగించి, పనులు పూర్తి చేయకుండానే నిధులు తీసుకుని వెళ్ళిపోయారు అని అన్నారు.2024 మార్చిలో ప్రాజెక్టుకు భూమిలిచ్చిన రైతులకు సైతం నోటీసులు ఇచ్చి సభకు రాకుండా అడ్డకుని పూర్తి కాకుండానే , 10 క్యూసెక్కులు కూడారాని వెలిగొండ ప్రారంభోత్సవం అంటూ మోసం చేశారు అని మండిపడ్డారు.గత ప్రభుత్వం ఒక్కరంటే ఒక్కరికైనా పునరావాసం చేశామని చెప్పే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు.ఒక్క గ్రామానికి కూడా పునరావాస కాలనీలు నిర్మించి, వారిని తరలించే పని చేపట్టలేదు.ఇది రైతులను మోసం చేయడం కాదా? అని అన్నారు.ఫీడర్ కెనాల్ అధ్వాన స్దితిలో ఉంది.దాని గుండా నల్లమల సాగర్ కు నీరు వదిలితే అది కనీసం అయిదారు చోట్ల తెగిపోయి,రిజర్వాయర్లోకి రాకుండా పోతుంది అని అనుమానం వ్యక్తం చేశారు.రెండు దశల్లో వెలిగొండ ప్రాజెక్టును వెనువెంటనే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు అని తెలిపిన ఆయన ఫేజ్-1లో హెడ్ వర్క్స్,రెండు టన్నెల్స్ ,ఫీడర్ ఛానెల్, రిజర్వాయర్, రెగ్యులేటర్ వంటి నిలిచినపోయిన పనులు పూర్తి చేసి వచ్చే సీజన్ నాటికి 1.19 లక్షల ఎకరాలకు నీళ్ళు ఇస్తాం అని అన్నారు.జగన్ తన విష పత్రిక సాక్షికి మాత్రం యాడ్స్ రూపంలో 300 కోట్లు ఇచ్చుకున్నారు. సాక్షికి ఇచ్చిన ప్రాధాన్యత వెలిగొండ ప్రాజెక్టుకుహొఇవ్వలేదు అని,వెలుగొండ ప్రాజెక్ట్ మిగిలిన పనులను ఎప్పుడు మొదలు పెట్టి ఎప్పుడు పూర్తి చేస్తామన్న మాట స్వయంగా ముఖ్యమంత్రి తోనే వినిపిస్తామని వెల్లడించారు.ప్రాజెక్టు పరిశీలనలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, కార్పొరేషన్ చైర్మన్ లు, కలెక్టర్, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

## వెలిగొండ ప్రాజెక్టు సొరంగాలు పరిశీలించిన మంత్రులు

**మొదటి పేజి తరువాయి**

శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, ఎపి టూరిజం శాఖ ఛైర్మన్ నూకసాని బాలాజీ, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య,మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్,గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి,యర్రగొండపాలెం,దర్శి నియోజకవర్గం ఇన్చార్జిలు ఎరిక్షన్ బాబు,డాక్టర్ లక్ష్మీ, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, మార్కాపురం సబ్ కలెక్టర్ త్రివినాగ్, ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

పంతులు మెస్

ఆర్‌టిసి బస్టాండ్ దగ్గర, మార్కాపురం

## అటవీశాఖ అధికారుల వేధింపులు తాళలేక బ్లేడ్ తో గొంతుకోసుకున్న గిరిజనుడు



అగ్ని న్యూస్, యర్రగొండపాలెం (అక్టోబర్ 29) : అటవీశాఖ అధికారుల వేదింపులు తాళలేక గిరిజనుడు బ్లెడు తో గొంతు కోసుకున్న వైనం ఇది. మండలం లోని వెంకటాద్రి పాలెం పంచాయతీ ప్రకాష్ నగర్ కు చెందిన గిరిజనుడు భూమని పెద్దులు ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దీంతో అధికారులు చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.దోర్నాల లో ఇటీవల జరిగిన మాంగోలియన్ అలుగు కేసులో విచారణ పేరుతో గత రెండు రోజులుగా నిర్బందించడంతో గొంతు కోసుకొని ఆత్మహత్య యత్నానికి నిందితుడు పాల్పడినట్లు విశ్వసనీయ సమాచారం.అటవీశాఖ కార్యాలయం లో అధికారుల ఎదుటే ఈ సంఘటన జరిగింది అని సమాచారం. నిందితుడుని, అధికారులు మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్ కు తరలించారు. కాగా మాకు తెలియకుండ ఒంగోలు తీసుకు పోవడం ఏంటని బందువులు ఆందోళన చేపట్టారు.

## లంకా దినకర్ సమక్షంలో బీజేపీ లో చేరిన దుగ్గెంపూడి



అగ్ని న్యూస్,మార్కాపురం(అక్టోబర్ 29) : యర్రగొండపాలెం నియోజకవర్గం పెద్దారవీడు మండలం లోని బోడిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన వైకాపా సీనియర్ నాయకులు దుగ్గెంపూడి నారాయణరెడ్డి, బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు.మంగళవారం 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్, బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్ సమక్షంలో ఆయన వైకాపా ను వీడి బీజేపీ లో చేరారు.స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంలో లంకా దినకర్, దుగ్గెంపూడి కి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జి పివి కృష్ణారావు, సీనియర్ నాయకులు శాసనాల సరోజిని,బిజెవైఎం రాష్ట్ర నాయకులు జీవి రెడ్డి, ఎర్రగొండపాలెం నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ యనమల నాగేశ్వరావు, పెద్దారవీడు మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు బొచ్చు కోటిరెడ్డి, దోర్నాల మండల బిజెపి అధ్యక్షుడు సురవరం గండి వీరారెడ్డి, ఎర్రగొండపాలెం మండల బిజెపి అధ్యక్షుడు మాదాల సూర్యనారాయణ, రాష్ట్ర మైనార్టీ నాయకులు కాసింపిరా, బీజేవైఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, పాలంకయ్య, దోర్నాల మండలం ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పుప్పాల గాలయ్య, మహిళా నాయకురాలు వాసవి ప్రియ తదితరులు పాల్గొన్నారు. పార్టీ లో చేరిన అనంతరం దుగ్గెంపూడి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, రైతు సంక్షేమం కోసం తీసుకున్న చర్యల పట్ల ఆకర్షితుడనై బీజేపీ లో చేరినట్లు చెప్పారు. పెద్దారవీడు మండలం లో బీజేపీ విస్తరణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి

కేవలం 499/- మాత్రమే only soft copy

## మంత్రులను మర్యాద పూర్వకంగా కలిసిన బిజెపి నాయకులు



అగ్ని న్యూస్,పెద్ద దోర్నాల (అక్టోబర్ 29): వెలుగొండ ప్రాజెక్ట్ సందర్శించడానికి దోర్నాల విచ్చేసిన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంక దినకర్ ను బీజేపీ నాయకులు కలిసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ నాగేశ్వరరావు, దోర్నాల బిజెపి మండల అధ్యక్షుడు సురవరం గండి వీరారెడ్డి, పెద్దారవీడు బిజెపి మండల అధ్యక్షుడు బొచ్చు కోటిరెడ్డి, ఎర్రగొండపాలెం మండల అధ్యక్షుడు మాదాల సూర్యనారాయణ, రాష్ట్ర మైనార్టీ వెర్చా కార్యవర్గ సభ్యులు కాసిం పీరా, డి రమేష్, బి వివేక్ ( నాని) లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా బొకేలతో ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి దృష్టికి వెలిగొండ ప్రాజెక్టు ఎంత త్వరితగతిన పూర్తి అయినట్లయితే అంత మేలు జరుగుతుందని, వలసల నివారణ జరుగుతుందని, పేద ప్రజలు ఎంతో ఆనందంగా జీవించడానికి వెంటనే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని కోరారు.

# సీతానాగులవరం లో రీ సర్వే పై గ్రామ సభ




అగ్ని న్యూస్,తర్లుపాడు (అక్టోబర్ 29): మండలంలోని సీతానాగులవరం గ్రామంలో తహసీల్దార్ విజయభాస్కర్ మంగళవారం రీసర్వే పై గ్రామ సభ నిర్వహించారు. రీ సర్వే లో భూమి తక్కువ పడటం, ఎక్కువగా పడటం, అలాగే ఒకరి భూమి ఇంకొకరికి ఆన్లైన్ లో ఎక్కటం వంటి వాటిపై పలు అర్జీలు తీసుకోవటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాటికొండ ఆంజనేయులు,మండల సర్వేయర్ శ్రీవాణి, వి ఆర్ ఓ ఆదినారాయణ, వి ఆర్ ఎ రసూల్, విలేజ్ సర్వేయర్ మస్తాన్, రవళి, నాగేశ్వరావు రైతులు పాల్గొన్నారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :

## వన్య ప్రాణులను వేటాడితే కఠిన చర్యలు - మంత్రి పవన్ కళ్యాణ్

- వన్యప్రాణుల సంరక్షణకు ట్రోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు



(అగ్ని ప్రతినిధి,మంగళగిరి)మంగళగిరి క్యాంపు కార్యాలయంలో అటవీ శాఖ యాంటీ పోచింగ్ సెల్ రూపొందించిన పోస్టర్ ను ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ విడుదల చేశారు. వన్యప్రాణులను వేటాడటం... చంపడం... అక్రమ రవాణా చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠినమైన శిక్షలు ఉంటాయి అని స్పష్టం చేశారు. అడవులను సంరక్షించడం, వన్యప్రాణులను కాపాడటం మనందరి బాధ్యత అని , ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పినట్లు మనది వసుధైక కుటుంబం అని అన్నారు. భూమ్మీద మనతో పాటు సహజీవనం చేస్తున్న జంతువులు చెట్లు చేమలు, పశు పక్షాదుల పట్ల కరుణ చూపాలని, వాటికి మనలాగే బతికే హక్కు ఉంద'ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. మంగళగిరి లోని క్యాంపు కార్యాలయంలో వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీ శాఖలోని యాంటీ పోచింగ్ సెల్ రూపొందించిన పోస్టర్ ను విడుదల చేశారు. వన్య ప్రాణుల వేట, అక్రమ రవాణా సమాచారం ఉంటే యాంటీ పోచింగ్ సెల్ కు తెలిపేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ వరాట్లాడుతూ... “వన్య ప్రాణుల సంరక్షణ చట్టం 1972 ప్రకారం వన్య ప్రాణులను వేటాడటం, చంపడం, అక్రమ రవాణా చేయడం నిషేదం అని, ఎవరైనా వన్యప్రాణులను వేటాడటం,అటవీ సంపదను నాశనం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇది మంచి ప్రభుత్వం... బాధ్యతగల ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం మంచి ప్రభుత్వంతో పాటు బాధ్యత గల ప్రభుత్వం అని పేర్కొన్నారు.ముఖ్యంగా అటవీశాఖ అధికారులు విధులకు కట్టుబడి ఉన్నారని ,చిత్తూరు జిల్లా కౌండిన్య అభయారణ్యంలో ఇటీవల చిరుత పులిని చంపిన నిందితులను మూడు రోజుల్లో పట్టుకొని రిమాండ్ కు తరలించారు అని గుర్తు చేశారు.అలాగే పల్నాడు జిల్లాలో అరుదైన జంతువును చంపిన నిందితులను రోజుల వ్యవధిలో అదుపులోకి తీసుకున్నారని,మీ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎవరైనా వన్యప్రాణులను వేటాడినా, చంపినా, అక్రమ రవాణాకు పాల్పడినా అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. 18004255909 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం అందించండని విజ్ఞప్తి చేశారు.అలాగే అటవీ సంపదను నాశనం చేసినా, అక్రమ మైనింగ్ కు పాల్పడిన అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు ఈ కార్యక్రమంలో అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము, పీసీసీఎఫ్ చిరంజీవ్ చౌదరి, అటవీ శాఖ ఉన్నతాధికారులు ఎ.కె. నాయక్, శరవణన్, రాహుల్ పాండే, శాంతిప్రియ పాండే తదితరులు పాల్గొన్నారు

## సబ్ కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎంపీడీవో



అగ్ని న్యూస్, మార్కాపురం (అక్టోబర్ 29) మార్కాపురం ఎంపీడీవో బి.శ్రీనివాసులు,సబ్ కలెక్టర్ త్రివినాగ్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న పరిస్థితులు సబ్ కలెక్టర్ కు వివరించారు. ఈయన వెంట ఎఈ మోహన్ రాజ్, సీనియర్ అసిస్టెంట్ వి.శ్రీనివాస్ లు సబ్ కలెక్టర్ ను కలిసిన వారిలో ఉన్నారు.

## మల్లన్నను దర్శించుకున్న మంత్రి గొట్టిపాటి



(అగ్ని ప్రతినిధి, శ్రీశైలం) ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల క్షేత్రంలో వెలసిన శ్రీ మల్లిఖార్జున స్వామి వారిని మంగళవారం ఉదయం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దర్శించుకున్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి లతో కలిసి మంత్రి గొట్టిపాటి, స్వామి అమ్మవార్ల ను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనాలు అందించారు. ఆలయ పిఆర్ఓ శ్రీనివాస్ ఆలయ మర్యాదలతో వీరికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ ముఖ్య నాయకులు పాల్గోన్నారు.

## విచారణ ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం పై అవగాహన



అగ్ని న్యూస్,గిద్దలూరు (అక్టోబర్ 29): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి కె. శ్యాంబాబు గిద్దలూరు లోని సబ్ జైలును ఆకస్మికముగా తనిఖీ చేశారు. విచారణలో ఉన్న ఖైదీలకు అందుతున్న సదుపాయాలు, వసతులను పరిశీలించారు. ఆవేశంలోని ర్ణయాలు తీసుకోవద్దని హితవు పలికారు. ప్రైవేటుగా లాయర్ పెట్టుకునే స్తోమతలేని వారికి ఉచితంగా న్యాయవాదిని అందజేస్తామన్నారు. ఇందుకు సంబంధించి న్యాయ సేవాధికార సంస్థకు జైలు అధికారుల ద్వారా అర్జీ పెట్టుకోవచ్చన్నారు. బెయిల్స్, ఉచిత న్యాయ సహాయము, న్యాయ సేవాధికార సంస్థ చట్టం గురించి విచారణ ఖైదీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ సూపరిండెంట్ యు.లింగారెడ్డి, సబ్ జైల్ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్ అద్దంకి. మధుసూదన్ రావు పాల్గొన్నారు.

## రాచర్ల పోలీస్ స్టేషన్ లో రికార్డులు పరిశీలించిన సీఐ రామకోటయ్య




అగ్ని న్యూస్,గిద్దలూరు (అక్టోబర్ 29): గిద్దలూరు సీఐ జె.రామకోటయ్య మంగళవారం రాచర్ల పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్టేషన్ లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసు డైరీలను, రిజిష్టర్ లను పరిశీలించి, రికార్డులన్నీ సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని చెక్ చేసి పోలీస్ స్టేషన్ లో సిబ్బంది యొక్క పనితీరును తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ లో పెండింగ్ కేసులు అన్ని పూర్తి చెయ్యాలని సూచించారు. స్టేషన్ రికార్డ్స్ తనిఖీ చేసి పెండింగ్ కేసులను త్వరగా విచారణ జరిపి కోర్ట్ కి పంపాలని సూచించారు. బాధితులతో మర్యాదగా ప్రవర్తించాలని నిష్పక్షపాతంగా విచారణ చేసి న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. ముఖ్యంగా గంజాయి, పేకాటపై ప్రత్యేక నిఘ పెట్టి ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దొంగతనాలు జరగకుండా పోలీస్ అధికారులు రాత్రిపూట పెట్రోలింగ్ చెయ్యాలన్నారు. సైబర్ నేరాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

## మృతి చెందిన బాలుని కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ నాయకులు



అగ్నిన్యూస్,గిద్దలూరు(అక్టోబర్29): రెండు రోజుల క్రితం అనుమానాస్పద రీతిలో మృతి చెందిన చిన్న హుస్సేన్ తల్లిదండ్రులను బీజేపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. చిన్న వయసులో మరణించడం చాల బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకొని సహాయం చేయాలని ఎం ఎల్ ఎ అశోక్ రెడ్డి,పోలీస్ డిపార్ట్మెంట్ ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని కోరారు. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు, అప్పిశెట్టి ఉదయ శంకర్,జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జె వి నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడత ల రమేష్ రెడ్డి, జిల్లా మైనార్టీ మోర్చ అధ్యక్షులు షేక్ ఖాదర్ వలీ, షఫీ, ఒ బి సి మోర్చ కార్యవర్గ సభ్యులు వీర చక్రము, సీనియర్ నాయకులు మారుతి ప్రసాద్, రమేష్ లు ప్రాముఖ్యత వారిలో ఉన్నారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :
అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

# వెలుగొండ ప్రాజెక్టు ను నిశితంగా పరిశీలించిన మంత్రి నిమ్మల



## - సొరంగం,గ్యాప్,ఫీడర్ కెనాల్ ల పరిశీలన



(అగ్ని ప్రతినిధి, మార్కాపురం)వెలిగొండ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు క్షేత్రస్థాయి లో పరిస్థితిని మంగళవారం పరిశీలించారు. ఇందుకోసం సోమవారం రాత్రే ఆయన దోర్నాల లోని ప్రాజెక్టు గెస్ట్ హౌస్ కు చేరుకున్నారు. మంగళవారం ఉదయం రాష్ట్ర విద్యుత్ శాఖ వంత్రి గొట్టిపాటి రవి కుమార్, సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయులు, ఒంగోలు ఎం.పీ. మాగుంట శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర మ్యారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, 20 సూత్రాలహౌఅమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్ రావు, బీ.ఎన్.విజయ్ కుమార్,హౌ కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, దర్శి నియోజకవర్గ ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మీ, యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్చార్జి ఎరిక్షన్ బాబు తదితరులు గెస్ట్ హౌస్ కు చేరుకున్నారు. అనంతరం 9:30 గంటలకు వీరందరూ కలిసి వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్స్ పరిశీలించారు. ఇప్పటివరకు పనులు కొనసాగిన తీరు, పెండింగ్ పనులపై అధికారులతో చర్చించారు.

### మండుటెండలో ద్విచక్ర వాహనాలపై...

అనంతరం వీరు కడపరాజుపల్లె గ్రామం వద్ద వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువకు ఇటీవల వర్షాల వలన పడిన గండి, కోతలను పరిశీలించారు. కాలువ కట్టపైన కారులు వెళ్లే అవకాశం లేకపోవడంతో మండుటెండలో వీరు రెండున్నర కిలోమీటర్ల దూరం ద్విచక్ర వాహనాలపై వెళ్లి వాటిని పరిశీలించారు.

### గొట్టిపడియ గ్యాప్, ఇంటేక్ వెల్ పరిశీలన...

తదనంతరం గొట్టిపడియ డ్యామ్, ఇంటేక్ వెల్ నిర్మాణ పనులను వీరు పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, నీటి స్టోరేజీ వివరాలను అధికారులు ఈ సందర్భంగా మంత్రులకు, ప్రజా ప్రతినిధులకు వివరించారు. ఇక్కడ నీటి స్టోరేజ్ వలన భూగర్భ నీటిమట్టం పెరగడంతో పాటు ముంపు, పునరావాస అంశాలను కూడా వారికి తెలియజేశారు. అనంతరం మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెలిగొండ ప్రాజెక్టు పూర్తి నమూనాను మంత్రులు పరిశీలించారు. ఈ ప్రాజెక్టు వలన కలిగే తాగు, సాగునీటి ప్రయోజనాలు, ఇతర వివరాలను ప్రాజెక్ట్స్ ఎస్.ఈ. అబూత్ అలీమ్ ఈ సందర్భంగా మంత్రులకు వివరించారు. మధ్యాహ్నం 3:30 గంటల వరకు క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన పనులను మంత్రులు పరిశీలించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం చీఫ్ ఇంజనీర్ శ్యామ్ ప్రసాద్ తో కలిసి ఇక్కడకు వచ్చి స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించినట్లు జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

# తుమ్మల చెరువు ఖాసీం స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే దామచర్ల



అగ్ని న్యూస్,తర్లుపాడు(అక్టోబర్ 29) : మండలం లోని తుమ్మలచెరువు గ్రామం లో ఎంతో విశిష్టత కలిగిన ఖాసీం స్వామి దర్గాలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈయన వెంట మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, జనసేన పార్టీ ఇంచార్జీ ఇమ్మడి కాశీనాథ్, యువనాయకులు కందుల రోహిత్ రెడ్డి స్వామిని దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

# తర్లుపాడు, కలుజువ్వలపాడు లో పొలం పిలుస్తోంది కార్యక్రమం




అగ్ని న్యూస్,తర్లుపాడు (అక్టోబర్ 29): మండలంలోని తర్లుపాడు, కలుజువ్వలపాడు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ రబీ 2024-25 సీజన్ లో ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం కింద రైతులు వారి అంతట వారే పంట భీమా కి రైతు వాటా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. ఈ సీజన్ లో ప్రకాశం జిల్లా లో శనగ, మినుము, వరి, జొన్న, మొక్క జొన్న, ఎండు మిరప పంటలకు పంటల బీమా పథకం కింద వర్తిస్థాయని తెలిపారు. పంటలు భీమా చేయదల్చిన వారు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకాలు, పంట ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నెంబర్ మొదలైనవి తీసుకొని మీ-సేవ, సి ఎస్ సి సెంటర్, బ్యాంక్ లు మొదలైన చోట పంట భీమా చేసుకోవచ్చని తెలిపారు. పై పంటలు వేసిన రైతులు తప్పనిసరిగా పంట భీమా కి నమోదు చేసుకోవాలని సూచించారు. పంట భీమా అన్ని పంటలకి 15.12.2024 వరకు వరి పంట కి 31.12.2024 వరకు గడువు తేదీ అని తెలిపారు.వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ జె సౌజన్య మాట్లాడుతూ గొర్రెల మేకలకు సామూహిక నట్టల నివారణ మందుల ప్రోగ్రాం 20.10. 2024 నుండి 31. 10. 2024 వరకు జరుగుతుందన్నారు. 21 వ పశుగణన కార్యక్రమం ఈనెల 25 నుండి 25.02.2025 వరకు జరుగుతుందని ప్రతి గ్రామాలలో పశుసంవర్ధక సిబ్బంది వచ్చి పశుసంపదను లెక్కించుట జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ యం. నందన, వి ఏ ఎస్. ఓబయ్య, యం ఐ డి సి, గ్రామ వ్యవసాయ సహాయకులు బోర్రయ్య, గోవింద్ భాషా, మల్లికార్జున ఎంపీఈఓ, రైతులు పాల్గొన్నారు.

## టీ-5 కాలువను చిన్న కండలేరు వరకు పొడిగించాలి



అగ్ని న్యూస్,యర్రగొండపాలెం (అక్టోబర్ 29) : టి–5 కాలువను పుల్లలచెరువు, చిన్న కండలేరు వరకు పొడిగించి ఈ ప్రాంతానికి సాగు, త్రాగు నీరు అందించాలని నీటీ పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టుకు రూ. 2 వేల కోట్ల మంజూరు చేయాలని కోరుతూ అదేవిధంగా వెలుగొండ ప్రాజెక్ట్ పరిధి లో తీగలేరు కాలువను పొడిగించి పనులు చేపట్టాలని చిన్న కండలేరు రిజర్వాయర్ కింద దాదాపు 2 వేల ఎకరాలు సాగులో ఉందని, శాశ్వత పరిష్కారం టీ–5 కాలువ ద్వారానే నెరవేరుతుందని రైతులు ఆకాంక్షిస్తున్నారు. ఆయన వెంట సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి జి.గురునాధం, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి కృష్ణ గౌడ్, రైతు సంఘం నాయకులు సాంబశివరావు, నక్కా తిరుపతయ్య, బాణాల రామయ్య తదితరులు ఉన్నారు.

# గజ్జలకొండలో పొలం పిలుస్తోంది




అగ్ని న్యూస్, మార్కాపురం (అక్టోబర్ 29) : మండలం లోని గజ్జలకొండ, నాయుడుపల్లి గ్రామాల యందు మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు, కంది పొలాలను సందర్శించిన అనంతరం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ 2024 –25 సీజన్ నుంచి ప్రధాన మంత్రి ఫసల్ భీమా పథకం లో భాగంగా మినుము పంట కి ఒక ఎకరాకు 103=00 రైతు వాటా క్రింద సియస్సి ద్వారా ప్రీమియం చెల్లించి నట్లయితే నష్టము జరిగినప్పుడు ప్రభుత్వం ఆదు కుంటుందని తెలిపారు అదేవిధంగా రోజురోజుకు పెరుగుతున్న రసాయన ఎరువుల వినియోగం ద్వారా భూమిలోని సారం తగ్గి, మట్టి జీవాన్ని కోల్పోతుందని తెలిపారు. మట్టిలోని సారాన్ని పెంచి మట్టికి పునర్జీవం పోసేందుకు సేంద్రియ ఎరువులు ఎంతగానో తోడ్పడతాయని, ఈ సేంద్రియ ఎరువుల్లో పచ్చిరొట్ట ఎరువులు అయిన జీలుగులు, జనుమలు, పిల్లిపేసరలు కూడా ఒక భాగం అని తెలిపారు. పొలంలో పంట సాగుచెయ్యని సమయంలో పచ్చిరొట్ట ఎరువులను సాగుచెయ్యాలని. పచ్చిరొట్ట మొక్కలు తక్కువకాల వ్యవధిలోనే ఎదిగి మొక్కలకు అవసరమైన పోషకాలను అందించగలవని వివరించారు. ఉద్యాన శాఖ అధికారి హెచ్.ఓ రమేష్ మాట్లాడుతూ ఉద్యానవన శాఖ ద్వారా చేపడుతున్న పండ్ల తోటల పై అందిస్తున్న రాయితీ వివరాలను రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.యస్.కె సిబ్బంది జయంతి, నవీన్, రైతులు పాల్గొన్నారు




# వెలుగొండ ప్రాజెక్టును త్వరలో పూర్తి చేస్తాం



## - మంత్రి నిమ్మల రామానాయుడు

అగ్ని న్యూస్ పెద్ద దోర్నాల( అక్టోబర్ 29): జిల్లా జీవనాడి వెలుగొండ ప్రాజెక్ట్ ను ప్రాధ్యాన్యతా క్రమంలో త్వరలో పూర్తి చేసి ప్రకాశం జిల్లా ప్రజలకు సాగునీరు,తాగు నీరు అందించడం జరుగుతుంది అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వలన 4.5 లక్షల ఎకరాలకు సాగునీరు, 25 లక్షలమంది ప్రజలకు తాగునీరు అందుతుందని తెలిపారు. అనంతరం తీవ్ర ఎండలోను సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న. కడపరాజు పల్లి వద్ద ఇటీవల వర్షాలకు ఫీడర్ కాలుకు పడిన కోతను,ద్విచక్ర వాహనాలపై వెళ్లి మంత్రులు, కలెక్టర్ ఇతర ప్రజాప్రతినిధులు పరిశీలించారు. మండల కన్వీనర్ ఏరువ మల్లికార్జునరెడ్డి, బట్టు సుధాకర్‌రెడ్డి, అంబటి వీరారెడ్డి ,ఎస్కే బాబు, జెడి లక్ష్మయ్య, ఈదర మల్లయ్య, జనసేన కన్వీనర్ మురళి,కూటమి నాయకులుకార్యకర్తలు. పాల్గొన్నారు.









# దీపావళి సందర్భంగా

## అగ్ని పత్రిక ప్రకటన కర్తలకు

Bumper Offer

1.బ్యాక్ పేజీ లో పావుపేజీ యాడ్ కేవలం **2000** లకే...
2. సెంటర్ పేజీ లో పావు పేజీ యాడ్ కేవలం **1500** లకే
3. ఫ్రంట్ పేజీ లో పిల్లర్ మూడవ భాగం కేవలం **2000** లకే

వ్యాపార ప్రకటన లకు, శుభాకాంక్షల ప్రకటనలకు సంప్రదించండి..

**9441533080...**

**ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :** అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి కేవలం 499/- మాత్రమే only soft copy

Printed, Published & Owned by K.V.RAMANA RAO, APTEL 0548/01/1997 SV Printers - Markapur.(K.Rama Krishna- 9441533080/ 8309890844)